❖•❖•❖ 1 ❖•❖•❖

# మధ్యరాత్రివేళ తోటలో

*“పేతురును జెబెదయి యిద్దరు కుమారులను వెంటబెట్టుకొనిపోయి, దుఃఖపడుటకును చింతాక్రాంతుడగుటకును మొదలు పెట్టెను. అప్పుడు యేసు – మరణమగునంతగా నా ప్రాణము బహు దుఃఖములో మునిగియున్నది; మీరు ఇక్కడ నిలిచి, నాతో కూడ మెలకువగా నుండుడని వారితో చెప్పను” (మత్తయి 26:37, 38).*

మధ్యరాత్రి సమీపిస్తుండిన సమయంలో, యేసు గెత్సేమనే అనబడిన తోటలోనికి ప్రవేశించాడు. ఇది గానుగలో ఒలీవ నూనె తయారు చేయు గానుగ స్థలం. ఎందుకనగా, గెత్సేమనే అను పదమునకు “నూనె గానుగా” అని అర్థము. సంధ్యా సమయానికి ముందుగా, ఆయన తన శిష్యుల పాదాలు కడిగాడు (యోహాను 13:5–15). వినయము మరియు పరిచారమును గూర్చిన పాఠములను వారికి నేర్పించాడు. ఆయన తన శిష్యులతో కూడా పస్కాను ఆచరించాడు మరియు క్రైస్తవ యుగములన్నిటను ఆయన మరణమును స్మరణకు తెచ్చు ప్రభువు భోజన సంస్కారమును స్థాపించాడు (మత్తయి 26:26–29). రాత్రి భోజనమును ఆచరించిన తరువాత, ఆయన తన శిష్యులకు వీడ్కోలు పిదప (యోహాను 15; 16), ఆయన యోహాను సువార్త 17వ ఆధ్యాయంలో వ్రాయబడియున్న గొప్ప ప్రధాన యాజకత్వ ప్రార్థన చేశాడు.

మధ్యరాత్రి గడియలు దగ్గరపడుచుండినప్పుడు (బహుశ ఆ గడియలు దాటిపోయి యుండవచ్చును), ఆయన తన శిష్యులతో కూడా గెత్సేమనే తోటలోనికి వెళ్లాడు. వారు హిన్నోము అనబడు లోయ గుండా కెద్రోను వాగు దాటి వెళ్లారు, దేవాలయములో బల్యర్పణలుగా అర్పింపబడుటకు అసంఖ్యాకములయిన పస్కా గొఱ్ఱెపిల్లలు వధింపబడుచుండినందువలన దానిలోనికి వరదవలె ప్రవహించుచుండిన రక్తముతో కెద్రోను వాగు నీరు ఎరుపెక్కి యుండినవనుటలో సందేహము లేదు. త్వరలోనే వారు ఒలివల కొండకు ఏదో ఒక ప్రక్కలోని దిగువ భాగంలో ఉండిన తోట ద్వారము దగ్గరకు చేరుకొన్నరు. ఆ తోట యజమాని ఆయనకు సుపరిచితుడయ్యాడంటే ఆశ్చర్యమేమున్నది. అందువలన ఆయన ఆశించినపుడెల్లా అక్కడికి వచ్చి ఒంటరిగా వ్యక్తిగత ప్రార్థనలు చేసుకొనుటకు అనుమతి కూడ పొందియుంటాడు.

ద్వారము దగ్గర, ఆయన ఎనిమిది మంది అపొస్తలులను వదిలిపెట్టి, పేతురు, యాకోబు మరియు యోహానును మాత్రమే తనతో కూడా తోట లోనికి యింకా కొంత దూరం తీసుకెళ్లాడు. వారిని చుట్టుముట్టు యుండిన ఓలీవచెట్లు రాత్రి వేళ వీచిన పిల్ల గాలికి ఎండుటాకులుచేసినట్లు మృదువుగా మర్మధ్వని చేశాయి. అది నిశిరాత్రి. గనుక చలి ఉండినది. ఆ చోటునంతా కటిక చీకటి క్రమ్ముకొన్నది. చంద్రుని కాంతి చిత్తడి నేలను తాకకుండునట్లు చెట్లు అడ్డగించినవి. తనతో కూడ ఉండిన ముగ్గురు శిష్యులను ఆయనతో కలిసి మెలకువగా నుండవలెనని ఆయన ఆదేశించాడు. ఎందుకనగా, ఆయన ప్రార్థించుటకు వారి నుండి యింకా కొంచెము ముందుకు వెళ్లాడు.

అప్పుడప్పుడు ఆయన ఆంతర్యములో అలల వలె ఉప్పొంగుచుండిన భావోద్రేకముల

గూర్చి యేసు అరుదుగా మాట్లాడాడు. అలాంటి సమయాల్లో ఆయన చేపట్టిన కొన్ని చర్యలను మరియు కదలికలను సవిస్తరంగా వివరిస్తూ, సువార్తలలో లిఖింపబడియున్న వృత్తాంతములు ఆయన చేసిన విషయములను మనకు తెలియజెప్పుచున్నవి. కానీ, ఆయన ఆంతర్యములోని మనోభావాలను వివరించుటకు సువార్త రచయితలు బహు అరుదుగా ప్రయత్నించారు, గనుక మనము ఆయన హృదయాన్ని నింపిన భావోద్రేకముల గూర్చి సంక్షిప్తమైన పరిజ్ఞానములకే పరిమితమౌతున్నాము. లాజరు సమాధియొద్ద మరియ మరియు మార్త కన్నీరు కార్చుట చూచి కలవరపడిన యేసు ఆత్మలో మూలుగుచు పలికిన పలుకులు మనకు తెలిసినవే (యోహాను 11:33). తాను చూచిన విషయమై ఆయన మనస్తాపముతో కలత చెందాడు. ఆయన యెరూషలేము పట్టణములో ప్రవేశించుటకు ఒలీవల కొండ అంచునకు చేరుకొన్నప్పుడు, ఆ పట్టణము విషయమై ఏడ్చాడు (లూకా 19:41). ప్రజలు ఏమి చేయనై యుండిరో ఎరిగిన ఆయన బిగ్గరగా ఏడ్చాడు. యేసు తన శిష్యులను మేడ గదిలో కలిసికొన్నప్పుడు, “ఆత్మలో కలవరపడి – మీలో ఒకడు నన్ను అప్పగించునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని” చెప్పెను (యోహాను 13:21). ఇవి హృదయాన్ని ద్రవింపజేయు దృశ్యాలు. అవి అరుదైనవి గనుక అవి ఆయన పరిచర్యలో పర్వత శిఖరములవలె కొట్టవచ్చినట్లు కానవచ్చుచున్నవి.

ఏదిఏమైనా, గెత్సేమనే తోటలో, యేసు హృదయము యిదివరకెన్నడూ లేనివిధంగా ఇప్పుడున్నట్లు మనము గమనించగలము. ఇది ముక్తసరిగా ఉన్నది. అయినప్పటికిని, దాని చిత్రీకరణము హెబ్రీయులకు 5:7లో విడమర్చి చెప్పబడిన: “శరీరధారియైయున్న దినములలో మహా రోదనముతోను కన్నీళ్లతోను, తన్ను మరణమునుండి రక్షింపగలవానికి ప్రార్థనలను యాచనలను సమర్పించి, భయభక్తులు కలిగి యున్నందున ఆయన అంగీకరింపబడెను.” ఆయనను గెత్సేమనే తోటలో ముంచెత్తిన భావోద్రేక సమరము మరియు భారమైన ఆత్మకు సంబంధించిన ఒక హృదయ విషాదకరమైన పటము ఇక్కడ మనకు కనబడుచున్నది.

యేసు తన అంతర్గతములో అనుభూతిచెందుచుండిన పెనుగులాటను మరియు బాధను మత్తయి, మార్కు మరియు లూకా ఆరు పదబంధములతో[1] తేటపర్చుచున్నారు. తన హృదయములో చెలరేగుచుండిన విషయములను ఆయన తన సన్నిహిత సంబంధులకు నివేదించాడని అప్పుడప్పుడు వారు ఉదహరించి చెప్పుచున్నారు. ఇతర సందర్భములలో, వారికి ఆయనలో గోచరించిన అంశాలను గ్రంథకర్తలు వివరించారు. తన ఇహలోక జీవితంలోను పరిచర్యలోను ఇదివరకెన్నడును ఎదుర్కొనని ఏదో ఒక విషయాన్ని ఆయన ఈ తోటలో అనుభవించాడు. ఏమి జరుగుచుండినదో మనము గ్రహించలేము కానీ, చూచాయగా ఊహించుకొనగలము.

*యేసు అనుభవించిన సంఘర్షణలో తీవ్రమైన దుఃఖము ఇమిడియున్నది.* “నా ప్రాణము బహు దుఃఖములో మునిగియున్నది” అని ఆయన తనతో కూడా తీసుకొని వెళ్లిన ఆ ముగ్గురితో చెప్పాడు (మత్తయి 26:38). యేసు ఉపయోగించిన పదము, *perilupos* గాఢమైన వేదనను గూర్చిన ఆలోచనను తెలుపుచున్నది. సమయము గడిచిన కొలది భయభీతిని గొల్పు పాప భారమును సిలువపై తన ఆత్మలో మోయనైయుండిన సమయానికి ఆయన సమీపించుచుండగా, ఆయన దుఃఖములో మునిగిపోయాడు. లోకము యొక్క అపరాదము ఆయన నిష్కళంకమును, నిర్దోషమునైన మనస్సు మరియు హృదయము లోనికి ఆయనను నలుగగొట్టు బలముతో దిగివచ్చుచుండినది.

*ఆయన అనుభవించిన సంఘర్షణ దుస్థితిని కలుగజేయు లక్షణముతో కూడినదై యుండినది.* ఆయన "మిగుల విభ్రాంతి నొందుటకును ఆరంభించెను" అని మార్కు వ్రాయుచున్నాడు (మార్కు 14:33). "విభ్రాంతినొందెను" (*ekthambeo*) అను పదమును (ప్రమాద సూచనను గుర్తించి) "కలవరము చెందెను" అని కూడా అనువదించవచ్చును. యేసు శరీరధారియైన దేవుడై యుండెను; ఆయన దేవుని కుమారుడును, మనుష్య కుమారుడునై యుండెను. ఆయన సంపూర్ణంగా మానవుడయ్యాడు. అట్లయినప్పటికినీ, యింకను దైవత్వములోని రెండవ వ్యక్తియై యుండెను. మానవాళి రక్షణార్థమైన సమరము అస్పష్టంగాను, భయపెడుతున్నదిగాను అగుపించినది. ఆయన మానవత్వము దాని మూలముగా అణగద్రొక్కబడినది. అయితే, ఆయన దైవిక ఆత్మ దాని గూర్చి మూలుగుచుండినది.

*ఆయన తోటలో అనుభవించిన సంఘర్షణ ఆయన మునుపు మోసిన దానికంటె అత్యధిక భారమైన మోపైయుండినది.* ఆయన "మిగుల చింతాక్రాంతుడగుటకు ఆరంభించెను" (మార్కు 14:33) "చింతాక్రాంతుడగుట" (*ademoneo*) లేక, "మిగుల భారమైన" (KJV) అనగా సమీపించుచుండిన సంఘటన యొక్క మహత్వము వలన ఆయన ఆత్మ అంతగా క్రుంగిపోయినదని అర్థము. లొంగదీసుకొనుటకు ప్రయత్నించుచుండిన భారమువలన ఆయన ఆత్మ నీరసించి తూలిపోవుచుండినది.

*ఆయన అనుభవించిన సంఘర్షణ ఆయన భౌతిక శరీరమును మరణమునకు కొనిపోవునంతగా తీవ్రమైనదై యుండినది.* ఆయన ఆత్మ "*మరణమగునంతగ* ... బహు దుఃఖములో మునిగియుండినది" అని ఆయన చెప్పెను (మత్తయి 26:38; నొక్కిచెప్పింది నాది). ఆయనకు కలిగిన దుఃఖము మరియు విచారము ఆయన శరీరము వాటి ఒత్తడి వలన ఏర్పడిన ఓటమికి ఒప్పుకొనుచున్నదగునంతగా ఆయనను హరించివేసినవి. ఆయన శరీరమునకు కలిగిన ఈ నష్టము, "పరలోకము నుండి యొక దూత ఆయనకు కనబడి ఆయన బలపర్చుటకు" హేతువైనది (లూకా 22:43). ఆయన బలపర్చబడనట్లయితే, ఆయన తన శరీరమును మన నిమిత్తమై సిలువ మీద బలియాగముగా అర్పించలేకుండెడివాడు. సిలువ వేయబడక మునుపే కుప్పకూలిపోయెడివాడు.

*అయన అనుభవించిన సంఘర్షణ ఆయన ఆవేదన చేత వర్ణించబడినది.* "ఆయన వేదనపడి మరింత ఆతురముగా ప్రార్థన చేసెను" అని లూకా వ్రాయుచున్నాడు (లూకా 22:44ఎ). లూకా ఉపయోగించిన పదము *agonia* బాధకరమైన పోటీని, ఒకరు తన శాయశక్తులా పడు ప్రయాసను వ్యక్తము చేయుచున్నది. సిలువ వేయబడుట వలన కలుగు తీవ్ర మనోవ్యధను, శ్రమను సులభంగా అర్థం చేసుకొనగలము. కాని, భీకరమైన భీతిని పుట్టించు 'తోట'లోని వేదనను మనము సాధారణంగా గమనించము. ఒక ప్రక్క తన ప్రాణము, మరొక ప్రక్క మనుష్యుల ప్రాణములు దీని గూర్చిన ఘర్షణ నిమిత్తము యేసు తనను తాను సంసిద్ధము చేసుకొనుచు ఆయన మానవ అవగాహనకు అతీతమైన ఆవేదనలోనికి వెళ్ళిపోయాడు. మనము దాని క్షణికదృష్టిని ఆయన చెమట, "నేల పడుచున్న గొప్ప రక్త బిందువులవలె ఆయెను" అను ఘోషణ ద్వారా గ్రహించగలము (లూకా 22:44). ఆ ఒత్తిడి, ప్రయాస మరియు అగ్ని పరీక్షకు యేసు శరీరము ఎట్లు ప్రతిస్పందించినదో తెలియజెప్పుటకు పరిశుద్ధాత్మ ఒక వాక్యములోని ఒక భాగమును మాత్రమే ఉపయోగించాడు.

*ఆయన తన సంఘర్షణను ఒంటరిగానే ఎదుర్కొనెను.* ఆయన తన శిష్యులతో కూడా

ఉండవలెనని ఆశించాడు. కానీ, ఆయన ప్రార్థించాల్సిన అవసరము దాని కంటె అధికమైనదై యుండినది. ఆయన వారి నుండి వేరుచేయబడినప్పుడు సహితము వారు ఆత్మలోను, ప్రార్థనలోను ఆయనతో కూడా ఉండవలెనని ఆయన ఆశించాడు. శిష్యులు ఆనాటి సాయంకాల భావోద్రేక పూరితమైన సంభాషణల వలన అలసట చెంది యుండిరి. గనుక వారి శరీరములు విశ్రాంతిని ఆకాంక్షించినవి. వారు "దుఃఖముచేత నిద్రించుచుండిరి" అని లూకా చెప్పుచున్నాడు (లూకా 22:45). శరీర బడలికవలన వారి కళ్ళు నిద్రాభారముతో నిండిపోయినవి. ఆ నాటి రాత్రి యేసు వారి సహవాసమును, ప్రార్థనను యిదివరకెన్నడూ లేనంతగా కోరియుంటాడు. కానీ, వారు కునుకు లోనికి జారిపోయారు. ఆ భీషణమైన ఘడియలతో పోరాడుటకు యేసు ఒంటరివాడుగానే మిగిలిపోయాడు.

*ఆయన ఎదుర్కొన్న సంఘర్షణలో సాతానుయొక్క దుష్ట శక్తులు ఆయన వాటిని ఆనాటి వరకు ఎదుర్కొనని విధంగా జోక్యము చేసుకొనుచుండెను.* యేసు తన పరిచర్యను ప్రారంభించినప్పుడు అపవాది చేత శోధింపబడుట ముగిసిన తరువాత, అపవాది "కొంతకాలము" ఆయనను విడిచి పోయెను (లూకా 4:13; KJV). ఇప్పుడు ఈ తోటలో అపవాది ఆయనకు ప్రత్యర్థిగా వాడు సమకూర్చుకొన గలిగిన అత్యంత శక్తిసామర్థ్యములుగల సైన్యముతో వచ్చాడు. యేసు అపవాదిని అంతకు మునుపు కూడా ఎదుర్కొన్నాడు. కానీ, ఆ సంఘర్షణలు తక్షణమే చర్యలు చేపట్టాల్సినవి కాకుండెను. దీనంతటి భయానక లక్షణము వాటికి లేకుండెను. అంధకారము అలుముకొనియున్న లోకము యొక్క విపరీతమైన భయములు ఏమాత్రం చలించని పట్టుదలతో యేసును ఆవరించుచుండినవి.

మన ప్రభువు ఈ తోటలో అనుభవించిన వేదన యొక్క లోతులను ఎవరును కొలువలేరు. ఆయన అనుభవించుచుండిన గొప్ప ఒత్తిడి ఒక సవాలును ఆయన ముందుంచినది. ఆ సవాలును సహితము మనము చూడగలము. దేవుని పరిశుద్ధ కుమారుడు లోక పాపముల నిమిత్తము ప్రాయశ్చిత్త బలియగుటకు సమాయత్తమగుచుండెను.

యేసు గొప్ప దుఃఖములో మునిగియుండినప్పుడు ఆయన దేవునితో కూడా ఉండవలెనని ఆశించాడు. ఆయన తోట లోనికి వెళ్లుట ద్వారా, "మీరు అత్యంత లోతైన గాఢాంధకారపు లోయలోనైతేనేమి, అత్యంత గొప్ప సంఘర్షణలోనైతేనేమి ఉన్నప్పుడు, మీ పరలోకపు తండ్రితో ఒంటరిగా ఉండండి. ప్రశాంతమైన చోటుకు వెళ్లి ఆయన యెదుట మీ హృదయాన్ని తెరువండి" అని ఆయన మనకు ఉపదేశించుచున్నాడు. దేవుని కుమారుడు సహితము తన సన్నిహిత స్నేహితులలో ఊరటను కనుగొన్నాడు. తన హృదయము నిండియుండిన భారమునుబట్టి వారు కూడా ఆయనతో కలిసి మెలకువగా ఉంటూ, ప్రార్థించుచుండవలెనని తన శిష్యులను అడిగాడు. ఆయన "వారి యొద్ద నుండి రాతివేత దూరము వెళ్లి మోకాళ్ళూనెను" అని లూకా చెప్పుచున్నాడు (లూకా 22:41). "వెళ్లెను" అను మాటకు లూకా ఉపయోగించిన *apospao* అను పదమునకు, "ఒకరు తనను తాను దూరముగా విడదీసికొనుట" అని అర్థము. ఆయన వారికి ఉద్బోధించెను. అంతమాత్రమే గాక, ఆయన త్వరలో అనుభవించనై యుండిన క్లిష్ట పరిస్థితిని కూడా ఆయన ఎరిగి యుండెను. గనుక వారు ఆయనకు దగ్గరగా ఉండి ఆసన్నమగుచుండిన ఆపద గూర్చి ప్రార్థించుచుండవలెనని ఆయన ఆశించాడు.

మనము ఇతరులతో కలిగియుండవలసిన సంబంధములకు సంబంధించిన మరొక గంభీరమైన సత్యమును యేసు నిదర్శనాత్మకంగా తేటపర్చాడు. "అత్యంత భారమైన మోపు

మన మీదికి వచ్చిపడినప్పుడు, మీకు అత్యంత ప్రియమైన వారని మీరు ఎంచు వారితో విషయమును పంచుకొనుమని" ఆయన చెప్పిన ఉదాహరణము మనకు తెలియజెప్పుచున్నది. దేవుని సర్వశక్తిమంతుడైన కుమారుడై యుండి యేసు, ఆయన అనుభవించుచుండిన విషయముల గూర్చి తన సన్నిహిత స్నేహితులకు తెలియజెప్పాడు. ఆయన తన అంతరంగములోని ఆవేదనలను అత్యంత బలమైన మాటలతో బయలుపర్చాడు.

అన్నిటిని మించి, మన ప్రభువైన యేసు గెత్సేమనే తోటలో అనుభవించిన విషయముల వివరణ, జీవితములో ఎదురయ్యే భారీ పోరాటములను, మనము పోరాడవలసిన ముందు రోజునే గెలువవచ్చునని తేటపర్చుచున్నది. యేసు తన తండ్రిని కలుసుకొని సిలువ మీద ఉన్నప్పుడు ఆయన చేయనై యుండిన విషయమును మరియు, దానిని చేయనై యుండిన విధానమును కూడా ముందుగానే స్థిరపర్చుకొన్నాడు. గెత్సేమనే తోటలోని అనుభవము తరువాత ఆయన ప్రశాంతతను మరియు సంపూర్ణ (ఆత్మ) విశ్వాసమును కలిగియుండెను. యేసు ఆయనకు ఎదురైన శ్రమలను సహించుచు వహించిన విధానము చేత ఎవరు ప్రభావితము కాజాలరు? ఆయన వాటి గుండా తన పరిష్కార మార్గమును అర్థించాడు. యేసు గబ్బతా మరియు గొల్గొతాతో ఎట్లు వ్యవహరించవలెనో గెత్సేమనే తోటలో, ఆ నాటి ముందటి రాత్రి, దృఢమైన సంకల్పముతో తీర్మానించుకొన్నాడు.

❖◆❖◆❖

*మనము కనికరమను గిన్నెలోనిది ఉగ్రత లేకుండా త్రాగగలుగునట్లు, ఆయన కనికరము లేకుండానే ఉగ్రత యను గిన్నె లోనిది త్రాగెను. ఆయన వేదన, మరణ భయమును గూర్చినది కాదు. కానీ, ఆయన భరించవలసి యుండిన పాపమునకు విరుద్ధముగా నుండిన దేవుని ఉగ్రత గూర్చిన లోతైన భావమై యుండెను. మరణమును చూచి, 'మరణించవలెను కదా' అని కాదు. కానీ, ఆ మరణము లోక పాపము యొక్క శాపము కదా అని ఆయన యొక్క నిష్కళంకమును, పరిశుద్ధమైన స్వభావము క్రుంగిపోయినది.*[2]

---

సూచనలు

[1]యేసు (1) "బహుగా దుఃఖపడెను" (మత్తయి 26:38), (2) "మరణమగునంతగా బహు దుఃఖములో మునిగియుండెను" (మత్తయి 26:38), (3) "మిగుల విభ్రాంతినొందెను" (మార్కు 14:33), (4) "బహుగా ... చింతాక్రాంతుడాయెను" (మార్కు 14:33), (5) "వేదనపడి ... మరింత ఆతురముగా ప్రార్థన చేయగా" (లూకా 22:44), మరియు (6) "ఆయన చెమట, నేల పడుచున్న గొప్ప రక్త బిందువుల వలె ఆయెను" (లూకా 22:44) అని సమ దృక్పథ సువార్తలు సూచించుచున్నవి. [2]J. Oswald Sanders, *The Incomparable Christ* (Chicago: Moody Press, 1952), 144.